క్లుప్తంగా

డ్రైయినేజీ నిర్మాణ పనుల ప్రారంభం


కొబ్బరికాయ కొట్టి డ్రైయినేజీ పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

లింగపాలెం: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలన సాగుతుందని మఠంగూడెం ఎంపీటీసీ మండలపు జమునారాణి అన్నారు. గురువారం మఠంగూడెం గ్రామంలోని ఎస్సీ కాలనీలో రూ.5 లక్షల సురక్షా నిధులతో చేపట్టే డ్రైయినేజీ నిర్మాణ పనులకు ఎంపీటీసీ జమునారాణి, సర్పంచ్ పి ప్రసాద్, పార్టీ నేతలు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ మండలపు సాయిబాబు, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు సత్కారం


విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కొయ్యలగూడెం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా రాణిస్తున్నారని ఎంఈఓ జె.సురేష్ బాబు పేర్కొన్నారు. పరింపూడి ఎంపీపీ స్కూల్ నుంచి నవోదయకు సీటు సాధించిన ఇద్దరు విద్యార్థులను గురువారం సత్కరించారు. ఈ కార్యక్రమానికి ఎంఈవో హాజరై విద్యార్థులను అభినందించారు. గతేడాది ఆరవ తరగతి విద్యనభ్యసించి నవోదయ సీటు సాధించిన కారం భవ్య నాగ సాయి, సింగవరపు చందులను హెచ్ఎం మట్ట బాలత్రి పురేశ్వరి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, స్కూల్ కాంప్లెక్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా వితరణ

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలోని ఎంపీపీ పాఠశాలకు గురువారం దాతలు బీరువా బహూకరించారు. దాతలు కొత్తపల్లి సోదరులు శ్రీను, నాగు, నరేష్, సురేష్ మాట్లాడుతూ తమ తల్లిదండ్రులు నాగేశ్వరరావు, శేషమ్మ జ్ఞాపకార్థం కేఎస్ఆర్ ఫౌండేషన్ నిర్వహిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా పాఠశాలకు బీరువా అందజేసినట్లు చెప్పారు. 4వ వార్డ్ కౌన్సిలర్ వలవల తాతాజీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చిటికెల అచ్యుతరామయ్య, 23వ వార్డ్ కౌన్సిలర్ లోకారపు వెంకటేశ్వరరావు, సామాజికవేత్త ధనకుమార్ పాల్గొన్నారు.

శ్రీవారి ప్రథమ చికిత్సా కేంద్రానికి మందుల అందజేత

ద్వారకాతిరుమల: శ్రీవారి దేవస్థానం ప్రాణదాన ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రథమ చికిత్సా కేంద్రానికి ఇద్దరు దాతలు గురువారం రూ.10 వేలు విలువ చేసే మందులను ఉచితంగా అందజేశారు. విజయవాడకు చెందిన భాస్కర్ మెడికల్ ఏజెన్సీ అధినేత సురేష్ సహకారంతో తాత వెంకట సుబ్రహ్మణ్యం, వీఎస్‌డీ మెడికల్ ఏజెన్సీ వారు ఈ మందులను ఆలయ ఏఈఓ ఆర్.లక్ష్మణస్వామికి అందజేశారు. వీటిని కాలినడక భక్తుల సౌకర్యార్థం వినియోగించాలని దాతలు కోరారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి


పాలవెల్లువ చెక్కులను పంపిణీ చేస్తున్న దృశ్యం

టి.నరసాపురం: మహిళలు ఉన్నతంగా ఎదిగేందుకు అవసరమైన ఆర్థిక పరిపుష్టి కల్పించే దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న పాలవెల్లువ దోహదపడుతుందని మక్కినవారిగూడెం సొసైటీ చైర్‌పర్సన్ పిన్నమనేని చక్రవర్తి తెలిపారు. స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జగనన్న పాలవెల్లువ చెక్కులను గురువారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న పాలవెల్లువ ద్వారా 8 మంది మహిళలకు ఒక్కొక్కరికి రూ.30 వేలు చొప్పున రూ.2,40,000 చెక్కులను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీఈఓ యువీవీ సత్యనారాయణ, కూకలకుంట్ల గోపి పాల్గొన్నారు.

వరి పొలాల పరిశీలన

పోలవరం రూరల్: పోలవరం గ్రామంలో గురువారం వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు క్షేత్ర పర్యటన నిర్వహించారు. ఏరువాక ప్రధాన శాస్త్రవేత్త కె.ఫణికుమార్ ఆధ్వర్యంలో వరిపొలాలను సందర్శించారు. వాతావరణం వేడిగా ఉండటం వల్ల నల్లి ఆశిస్తోందన్నారు. ప్రస్తుతం గింజ గట్టిపడే దశలో ఉన్నందున ఎటువంటి పురుగుమందులు వాడాల్సిన అవసరం లేదన్నారు. పొట్టదశలో ఉన్నప్పుడు డైకోఫాల్ 5ఎంఎల్ లేదా ప్రాపనోఫాస్ 2ఎంఎల్ లీటర్ నీటికి కలుపుకుని రెండుసార్లు పిచికారీ చేయాలన్నారు. ఏరువాక కోఆర్డినేటర్ డాక్టర్ టి.సుజాత, శాస్త్రవేత్త ఎస్.నాగేంద్రబాబు, మండల వ్యవసాయశాఖ అధికారి కె.రాంబాబు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దత్తి రాంబాబు, ఆర్‌బీకే చైర్మన్ పొన్నూరు నరసింహారావు, రైతు భరోసా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


పోలవరం రూరల్: సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


టి.నరసాపురం: ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సామంతపూడి సూర్యనారాయణరాజు


లింగపాలెం: రంగాపురంలో సంక్షేమ పథకాల లబ్ధి బోర్డును ఆవిష్కరించిన ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నేతలు


కొయ్యలగూడెం: కన్నాపురంలో ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమంపై ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

జగనన్న పాలన దేశానికే ఆదర్శం

- పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- అట్టహాసంగా వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం
- వైఎస్సార్ సీపీ పతాక ఆవిష్కరణ
- నాలుగున్నరేళ్ల పాలనను ప్రజలకు వివరించిన నేతలు


కుక్కునూరు: ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమంలో భాగంగా సంక్షేమ లబ్ధిని ప్రజలకు వివరిస్తున్న పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు


జంగారెడ్డిగూడెం: ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి


జంగారెడ్డిగూడెం రూరల్: నాలుగున్నరేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న దృశ్యం

కుక్కునూరు: సుపరిపాలన అందించడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే రోల్ మోడల్ గా నిలిచారని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. గురువారం కుక్కునూరు మండలంలోని మారేడుబాక సచివాలయంలో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే బాలరాజు పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సచివాలయ ఆవరణలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బడుగు, బలహీన వర్గాల ప్రజలకు మంచి చేయాలనే తపనతో నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. గత ప్రభుత్వ హయాంలో పాలకులు 600 హామీలు ఇచ్చి అమలు చేయకుండా ప్రజలను ఏవిధంగా మోసం చేశారో ప్రజలు చూశారన్నారు. అదే విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నవరత్నాల రూపంలో అందజేసిన విషయాన్ని గుర్తించాలన్నారు. నూటికి, నూరు శాతం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించిన ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమేనన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరలా భారీ మెజారిటీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు.

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం

మారేడుబాక గ్రామంలో గురువారం పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం తరుపున ఆయా కుటుంబాలకు అందిన లబ్ధి గురించి క్షుణ్ణంగా వివరించారు. జెడ్పీటీసీ కుంజా నాగేశ్వరావు, వైస్ ఎంపీపీలు తాండ్ర రాజేష్, గాడిద రామచంద్రం, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మాదిరాజు వెంకన్నబాబు, గంగుల రమణారెడ్డి, మండల సచివాలయ కో ఆర్డినేటర్ ఆవుల బాలక్రిష్టారెడ్డి, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు పాల్గొన్నారు.

నిమ్మలగూడెంలో...

బుట్టాయగూడెం: నిమ్మలగూడెంలో ఆంధ్రాకు జగన్ ఎందుకు కావాలంటే.. కార్యక్రమం గురువారం సాయంత్రం ఘనంగా ప్రారంభమైంది. ఎమ్మెల్యే తెల్లం బాలరాజు వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి మరింత మేలు జరగాలంటే వచ్చే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలన్నారు. పార్టీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు, సర్పంచ్ బన్నే బుచ్చిరాజు, సొసైటీ అధ్యక్షుడు ఆరేటి సత్యనారాయణ, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్‌బాజీ, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ప్రజల కష్టాలు తెలిసిన నాయకుడు

పోలవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో ప్రజల కష్టసుఖాలను తెలుసుకుని నవరత్నాల రూపంలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే.. కార్యక్రమంలో భాగంగా పోలవరం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదురుగా పార్టీ జెండాను వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు బుగ్గా మురళీకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ నాలుగున్నరేళ్లల్లో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చేవిధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు.

రాష్ట్రాభివృద్ధికి, సంక్షేమానికి జగన్ అవసరం

టి.నరసాపురం: రాష్ట్రాభివృద్ధికి, విస్తృత స్థాయిలో సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవసరం అని జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణరాజు అన్నారు. టి.నరసాపురంలో రెండవ సచివాలయం పరిధిలో గురువారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. దేవరపల్లి ముత్తయ్య, మండల పార్టీ యూత్ అధ్యక్షుడు కన్నం సర్వేశ్వరరావు, సర్పంచ్ సునంద, ఎంపీటీసీ ఎస్.వెంకట్రావు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు

లింగపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో ప్రతి ఇంటికీ పార్టీలు, కులమతాలకు అతీతంగా అనేక సంక్షేమ ఫలాలు అందిచటం జరుగుతుందని వైస్ ఎంపీపీ మట్టా సురేష్ అన్నారు. గురువారం రంగాపురంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా పథకాల శిలాఫలకాన్ని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నేతలు ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ మండలపు సాయిబాబు, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు, మండల సచివాలయ కన్వీనర్ అన్నపనేని శాంతరావు, భోగోలు సర్పంచ్ తాడేపల్లి శాంతరావు పాల్గొన్నారు.

కన్నాపురంలో ప్రచారం

కొయ్యలగూడెం: కన్నాపురం గ్రామంలో ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం గురువారం నిర్వహించారు. సచివాలయాల మండల కోఆర్డినేటర్ నూకల రాము ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రచారం చేస్తూ వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు.

సంక్షేమానికి చిరునామా సీఎం జగన్

జంగారెడ్డిగూడెం: సంక్షేమానికి చిరునామాగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తారని, ఆయన అవసరం రాష్ట్రానికి ఎంతో ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ 10వ సచివాలయం పరిధిలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. 10వ సచివాలయం పరిధిలో ఆయా సంక్షేమ పథకాలకు సంబంధించి డీబీటీ, నాన్ డీబీటీ కింద లబ్ధిదారులకు రూ. 47,84,14,800 లబ్ధి చేకూరినట్లు చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు చిటికెల అచ్చిరాజు, 10వ సచివాలయం పరిధిలో కనుమూరి లావణ్య, నేట్రు సుబ్బలక్ష్మి, ఏవీ రమణమూర్తి పాల్గొన్నారు.

పట్టిన్నపాలెంలో వై ఏపీ నీడ్స్ జగన్

జంగారెడ్డిగూడెం రూరల్: పట్టిన్నపాలెంలో ఆంధ్రప్రదేశ్‌కి జగన్ ఎందుకు కావాలంటే.. కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు ప్రజల వద్దకు వెళ్లి ప్రస్తుత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఎంపీపీ కొడమ జ్యోతి మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేసిందన్నారు. సంక్షేమం, అభివృద్ధి ఇలానే కొనసాగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, సర్పంచ్ పసుపులేటి రత్నకుమారి, సచివాలయాల మండల కన్వీనర్ గురజాల పార్థసారథి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బల్లే రామకృష్ణ, పార్టీ నాయకులు పసుపులేటి నాగార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ వైఎస్ జగన్‌ను ఆశీర్వదించండి


ద్వారకాతిరుమల: ఐఎస్ రాఘవాపురంలో అభివృద్ధి కార్యక్రమాల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

ద్వారకాతిరుమల: ప్రజలు వైఎస్సార్ సీపీ చేసిన మేలును గుర్తించి వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగన్‌ను ఆశీర్వదించాలని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు కోరారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మండలంలోని ఐఎస్ రాఘవాపురంలో గురువారం ఆయన ప్రారంభించారు. ముందుగా ఎమ్మెల్యే తలారి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆ తరువాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఇప్పటి వరకు సచివాలయ పరిధిలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు, వాటికైన ఖర్చు తదితర వివరాలతో కూడిన ప్రదర్శనా బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ విప్లవాత్మక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. మేలు జరిగితేనే ఓటు వేయమని అడిగే దమ్మున్న ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ అని అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన మేలును గ్రామగ్రామాన చాటాలని పార్టీ నేతలు, కార్యకర్తలకు ఆయన సూచించారు. అలాగే ప్రతిపక్షాల కుట్రలు, కుతంత్రాలు, జగన్ ప్రభుత్వంపై బురదచిమ్మేందుకు చేస్తున్న ప్రయత్నాలను ప్రజలకు అర్థమ్యేలా వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, గ్రామ సర్పంచ్ దాకారపు బంగారమ్మ, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, దాకారపు అగ్గియ్య, బోడ చంద్రరావు, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు మల్లెపూడి నాగమణి, ఐఎస్ జగన్నాధపురం సర్పంచ్ పసుపులేటి ఏసుబాబు, దాసరి ఏసురత్నం, రేగంటి వెంకటేశ్వరరావు, పెద్దిరెడ్డి జ్యోతిశ్రీనివాస్, జేసీఎస్ కన్వీనర్ భోగరాజు సాయికృష్ణ, తిరుమలంపాలెం, ద్వారకాతిరుమల సొసైటీ చైర్మన్‌లు భోగరాజు చిన్ని, గుర్రాల లక్ష్మణ్, బొండాడ వెంకన్నబాబు తదితరులున్నారు.

అధికారులు, కాంట్రాక్టర్లను ఇబ్బంది పెడితే సహించం


విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీపీ కోర్స పాసమ్మ, సర్పంచ్ చిర్రి జగదాంబ

బుట్టాయగూడెం (జీలుగుమిల్లి): షెడ్యూల్డ్ ప్రాంతాలలో అభివృద్ధి పనులలో భాగంగా సీసీ రహదారుల నిర్మాణ విషయంలో అధికారులను, కాంట్రాక్టర్లను ఇబ్బంది పెడితే సహించేది లేదని ఎంపీపీ కోర్స పాసమ్మ, జీలుగుమిల్లి గ్రామ సర్పంచ్ చిర్రి జగదాంబ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు వారు బుధవారం మండల కేంద్రంలో నిర్మాణం పూర్తిచేసుకున్న సీసీ రోడ్డుని పరిశీలించి అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతమైన జీలుగుమిల్లి మండల కేంద్రంలోని జగదాంబ సెంటర్ నుంచి పి.రాజవరం వెళ్లే రహదారి 30 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ప్రత్యేక చొరవ తీసుకుని మొదటివిడతగా రూ.20 లక్షల గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం పూర్తిచేయగా, మరో రూ.25 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రెండవ విడత సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టవలసి ఉందన్నారు. అయితే మొదటి విడతగా నిర్మాణం పూర్తిచేసిన సీసీ రోడ్డు పనులు నాణ్యతగా జరగలేదని కొందరు ప్రతిపక్షాలు వారికి అనుకూలంగా ఉన్న ప్రచార మాధ్యమాలలో అసత్య ప్రచారం చేస్తూ అధికారులు, కాంట్రాక్టర్లకు ఇబ్బంది కలిగిస్తున్నారని అన్నారు. ఈ ప్రచారంతో కాంట్రాక్టర్లు పనులు చేయడానికి ముందుకు రాని పరిస్థితులు సృష్టిస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తంచేశారు. సీసీ రోడ్డు నిర్మాణం పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువచ్చినందుకు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తుంటే కొందరు కావాలనే స్వలాభం కోసం ఇలా దుష్ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు ఎం.ధర్మరాజు, కుమ్మరి టోనీలు పాల్గొన్నారు.

కార్మికులకు చట్టాలపై అవగాహన అవసరం


న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి కిషోర్‌కుమార్

జంగారెడ్డిగూడెం: ప్రతి కార్మికుడు చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ కిషోర్‌కుమార్ అన్నారు. పట్టణంలోని మారుతి సుజుకీ షోరూమ్‌లో కార్మికులతో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. ఏటా నవంబర్ 9వ తేదీన న్యాయ సేవా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలలో న్యాయ వ్యవస్థకు సంబంధించిన అన్ని విషయాలపై అవగాహన కల్పించడం కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్మికులు చట్టాలపై, ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగాహన కలిగి ఉండాలని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బార్ సెక్రెటరీ ఏవీవీ భువనేశ్వరి, న్యాయవాదులు యు.ఏసుబాబు, మేకల రామ్మోహన్‌రావు, గంగరాజు, టి.ఫణిదీప్, ముళ్ళపూడి శ్రీనివాసరావు, మాదేపల్లి క్రాంతి కుమార్, పిల్లి పెద్దిరాజు, షోరూం మేనేజర్స్ షేక్ జహంఘీర్ భాషా, సుదర్శన్ రావు పాల్గొన్నారు.

ముంపు భూముల పరిశీలన


లబ్ధిదారుల సమస్యలను తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ రాజేంద్రన్

లింగపాలెం: కె గోకవరం చెరువు ముంపు పోరంబోకు భూములను నూజివీడు సబ్‌కలెక్టర్ ఆదర్శ రాంజేంద్రన్ గురువారం పరిశీలించారు. గ్రామంలోని సర్వేనెంబర్ 1లో 166 ఎకరాలు విస్తీర్ణం కలిగిన భూములను ఆయన పరిశీలించారు. ఈ భూములకు సంబంధించి లబ్ధిదారుల సమస్యలను ఆయన తెలుసుకున్నారు. ఈభూములకు సంబంధించి పూర్తి నివేదికను అందజేయాలని డిప్యూటీ తహసీల్దార్‌కి సూచించారు. ఆయన వెంట రాష్ట్ర లిడ్‌క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్, ఎస్సీ నాయకులు నందిపాం ఏసురత్నం, ముళ్లపూడి సుమన్, ఆదినారాయణ, రఘుబాబు ఉన్నారు.

వైఎస్సార్ సీపీ నుంచి చిలకా సతీష్ సస్పెన్షన్

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా గోపాలపురం నియోజకవర్గం ద్వారకాతిరుమల మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన చిలకా సతీష్‌ను వైఎస్సార్ సీపీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ఏలూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్లనాని ఒక ప్రకటనలో తెలిపారు. చిలకా సతీష్ వైఎస్సార్‌సీపీలో ఉంటూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుండడంతో అతని వైఖరిపై గోపాలపురం నియోజకవర్గం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. దీనిపై క్షుణంగా పరిశీలించిన మీదట సతీష్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేశామన్నారు. ఉభయగోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్లు పీ మిథున్‌రెడ్డి, పిల్లి సుభాష్‌చంద్రబోస్ ఆదేశాల మేరకు చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే ఆళ్ల నాని తెలిపారు.

ఏటీఏ ఆవిర్భావ దినోత్సవం

కుక్కునూరు: ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ 12వ ఆవిర్భావ దినోత్సవం గురువారం ఏటీఏ మండల కార్యదర్శి కట్టం పెంటయ్య అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఏటీఏ జిల్లా ఉపాధ్యక్షుడు కారం దారయ్య మాట్లాడుతూ ఆదివాసీల హక్కులు, చట్టాల కోసం ఏటీఏ అనునిత్యం పోరాడుతుందని పేర్కొన్నారు. ఆదివాసీల అమాయకత్వాన్ని అలుసుగా చేసుకొని గిరిజనేతరులు ఆదివాసీ హక్కులను కాలరాస్తూ అన్యాయం చేయాలని చూస్తే గట్టిగా బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆదివాసీ జెండాను ఎగరవేశారు.ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు పూరెం సీతారామయ్య, లక్ష్మి, ధనరాజు, కొమరం శ్రీనివాసరావు, కొవ్వాసి శ్రీకాంత్, మడకం భీమరాజు, కూరం సంజీవరావు, పైదా దొర్రై, మాధవరం సర్పంచ్ పాయం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ పంచారామ క్షేత్ర దర్శిని సర్వీసు

జంగారెడ్డిగూడెం: కార్తీకమాసం పురస్కరించుకుని ఆర్టీసీ ఆధ్వర్యంలో పంచారామ క్షేత్రదర్శిని సర్వీసును నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ గంగాధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్తీకమాసంలోని ప్రతి ఆదివారం అనగా ఈనెల 19, 26 తేదీల్లో డిసెంబర్ 3, 10వ తేదీలలో రాత్రి 8.45 గంటలకు జంగారెడ్డిగూడెం బస్టాండ్ నుంచి బస్సు బయలుదేరుతుందన్నారు. పంచారామాలైన అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట పుణ్యక్షేత్రాలకు తీసుకువెళ్లడం జరుగుతుందన్నారు. అల్ట్రాడీలక్స్ పెద్దలకు రూ.1100, పిల్లలకు రూ.850 రుసుము నిర్ణయించామన్నారు. ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం ఉందన్నారు. అలాగే అన్నవరం. అరుణాచల గిరి ప్రదక్షిణ నిమిత్తం ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని వివరాలకు ఆర్టీసీ బస్టాండ్‌లో సంప్రదించాలన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

పోలవరం రూరల్: మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ తెలిపారు. వివరాల ప్రకారం మండలంలోని కొత్త పట్టిసీమకు చెందిన కాట్రు కోటమ్మ కుమార్తె ఊబా సంధ్య, భర్తతో విభేధాలు రావడంతో తల్లి వద్దే ఉంటోంది. అయితే సంధ్య హైదరాబాద్‌లో ఓ ఇంట్లో పనిమనిషిగా పనిచేస్తూ గత నెల 15న దసరా సెలవులు కావడంతో పిల్లలను, తల్లిని చూసేందుకు కొత్తపట్టిసీమ వచ్చింది. అదే నెల 17వ తేదీన పిల్లలకు స్కూల్ బ్యాగ్‌లు కొనేందుకు తాళ్లపూడి వెళ్లి అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఇప్పటివరకు ఆచూకీ లభించకపోవడంతో తల్లి కాట్రు కోటమ్మ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ముగ్గురిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: ఒక వ్యక్తిని కొట్టి గాయపర్చడంతో పాటు దూషించిన నేరంపై ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆర్.మల్లికార్జునరెడ్డి తెలిపారు. వివరాల ప్రకారం ఈ నెల 8వ తేదీన మండలంలోని పేరంపేట గ్రామంలో దొరేపల్లి మధు అనే వ్యక్తి వేరొక వ్యక్తితో గొడవ పడుతుండగా, ఆ గొడవను ఆపేందుకు అదే గ్రామానికి చెందిన బందెల లలిత్ మనోజ్ ప్రయత్నించాడు. ఈ క్రమంలో దొరేపల్లి మధు తనను తీవ్రంగా కొట్టి కులం పేరుతో దూషించాడని, అక్కడే ఉన్న కఠారి శ్రీను, జంగా మహంకాళిరెడ్డి మధుకు సహకరించారని మనోజ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మధు వల్ల తనకు ప్రాణహాని ఉందని, తనకు రక్షణ కల్పించాలని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.